
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 8 సెప్టెంబరు 2025
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్టం : 33.0 కనిష్టం : 23.0





పనులను పరిశీలిస్తున్న పల్లా, ఎమ్మెల్యేలు, నేతలు

చురుగ్గా ఏర్పాట్లు



సూపర్‌సిక్స్.. సూపర్‌హిట్ సభకు సిద్ధమవుతున్న వేదిక

సూపర్ సిక్స్‌కు భారీ సన్నద్ధత...!

జీఎంఆర్ ఇంద్రప్రస్థలో ఏర్పాట్లు

సభకు 3.5 లక్షల మంది వస్తారని అంచనా

వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

అనంతపురం క్రైం, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ కొలువుదీరిన తర్వాత తొలిసారి రాష్ట్రస్థాయి కార్యక్రమానికి అనంతపురం నగరం వేదిక కాబోతోంది. సూపర్ సిక్స్- సూపర్‌హిట్ పేరుతో జిల్లా కేంద్రంలో ఈనెల 10న ప్రభుత్వం భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ అతిరథ మహారథులు ఈ కార్యక్రమానికి తరలిరానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ పెద్దలు (మిగతా 7లో...)



రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రులు, పల్లా

మహానాడును మించి సక్సెస్ చేస్తాం: రాష్ట్ర అధ్యక్షుడు పల్లా 7

సీఎం టూర్‌పై సమీక్ష
మ్యాపుల ఆధారంగా పరిశీలించిన నాయకులు

వదలని జ్వరం

- గ్రామాల్లో విజృంభిస్తున్న విష జ్వరాలు
- వేధిస్తున్న దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు
- ప్రైవేటు ఆస్పత్రులకు బాధితుల క్యూ
- గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం
- బెంబేలెత్తిస్తున్న దోమలు



ఓడీసీ బీసీ కాలనీలో రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): విజ జ్వరాలతో గ్రామీణ ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏ ఇంట్లో చూసినా దగ్గు, జలుబు, జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడేవారే కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. మండలంలోని బొడెద్దులవారిపల్లి, రామిరెడ్డిపల్లి, ఓడీసీ బీసీకాలనీ తదితర ప్రాంతాల్లో వైరల్ ఫీవర్ బాధితులు ఎక్కువగా ఉన్నారు. ప్రధానంగా చిన్నారులకు జ్వరాలు వస్తుండటంతో వైద్యం కోసం తల్లిదండ్రులు కదిరి, ఓడీసీ తదితర ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు.

నామమాత్రంగా ప్రభుత్వ వైద్యం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య స్థితిగతులు పరిశీలించాల్సిన ప్రభుత్వ వైద్య సిబ్బంది ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జ్వరపీడిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి, ఫాగింగ్ చేస్తున్నామని వైద్య శాఖ అధికారులు చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో అస్సలు అమలు కావడం లేదు.

పెరుగుతున్న జ్వర పీడితులు

విష జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. స్తోమత ఉన్నవారు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. లేనివారు ఏవో మందు బిల్లలు మింగుతూ ఇంటి వద్దే ముక్కుతూ మూలుగుతూ ఉన్నారు. బొండెద్దులవారిపల్లిలో బంకముత్తక వెంకటలక్ష్మమ్మ (మిగతా 7లో..)



యాడికి వద్ద గతేడాది వర్షాభావంతో దెబ్బతిన్న కందిపంట



ఫసల్ బీమాయ


Dear Sugali Narendra Naik
Farmer ID 127066730
Scheme: Pradhan Mantri Fasal Bima Yojna
Claim of Rs.25897.95 for Kharif 2024 could not be credited into your Aadhaar-linked bank A/C by FUTURE GENERALLI.
Please contact the Insurance Company or call 14447 to raise a complaint.
For Details: https://pmfby.gov.in/farmerLogin
9:47 pm

మెసేజ్ వచ్చింది.. లెక్క రాలేదు !

రూ.వేలల్లో మంజూరైనట్లు మెసేజ్‌లు..

రూ.వందల్లో జమ

గత నెల 11న జిల్లాకు రూ.77.49 కోట్లు విడుదల

ఇప్పటిదాకా రైతుల ఖాతాలకు జమ కాని వైనం

ఆందోళనలో అన్నదాతలు

అనంతపురం అర్బన్/యాడికి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా సొమ్ము జమలో మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. జిల్లాలోని పలువురు రైతులకు రూ.వేలల్లో ఫసల్ బీమా సొమ్ము మంజూరైనట్లు సెల్ ఫోన్లకు సంక్షిప్త సమాచారం ఇచ్చారు. అయితే వందల్లో బీమా డబ్బులు జమ కావడంతో రైతులు అవాక్కవుతున్నారు. ఫసల్ బీమాకు అర్హులైన రైతుల్లో ఎక్కువ మంది రైతులకు ఇప్పటి దాకా ఎలాంటి సొమ్ము జమ కాకపోవడం గమనార్హం. ఫసల్ బీమా యోజన టోల్ ఫ్రీ నంబర్ 14447కు కొందరు రైతులు ఫోన్ చేసినా... వారి నుంచి సరైన సమాధానం లేదు. పది రోజులకు మళ్లీ ఫోన్ చేయాలంటూ ఉచిత సలహా ఇస్తున్నట్లు తెలిసింది. దీంతో స్థానిక వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లి అడిగినా.. ఫసల్ బీమాను ఎప్పుడు జమ చేస్తారో చెప్పలేకపోతుండటంతో ఏం చేయాలో తోచని అయోమయంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

మెసేజ్‌ల మాయ..!

జిల్లాలో పలువురు రైతులకు రూ.వేలల్లో ఫసల్ బీమా మంజూరైనట్లు సెల్ ఫోన్లకు సమాచారం పంపారు. అయితే బ్యాంక్‌లోకి వెళ్లి ఆరా తీస్తే వందల్లోనే బీమా సొమ్ము జమైనట్లు చెబుతుండటంతో అవాక్కవుతున్నారు. ఉదాహరణకు.. రాయదుర్గం మండలం ఆర్‌బీ వంకకు చెందిన (మిగతా 7లో...)

గుత్తిలో చోరీ

8 తులాల బంగారం, 40తులాల వెండి, నగదు అపహరణ

గుత్తి, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జంగాల కాలనీలో తాటికొండ రమణ ఇంట్లో చోరీ జరిగింది. 8తులాల బంగారం ఆభరణాలు, 40తులాల వెండి ఆభరణాలు, నగదు చోరీ అయినట్లు బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాటికొండ రమణ తన కుటుంబ సభ్యులతో కలిసి వ్యాపారం నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లాడు. దీన్ని గమనించిన గుర్తు తెలియని దుండగులు తాళాలు పగల గొట్టి ఇంట్లో చొరబడ్డారు. బీరువాను తెరచి అందులో ఉన్న రూ.8లక్షలు విలువ చేసే 8తులాల బంగారం, 40తులాల వెండి, రూ.1.8లక్షలు చోరీ చేశారు. నాలుగు రోజుల తరువాత తాటికొండ రమణ తన కుటుంబ సభ్యులతో ఇంటికి రావడంతో చోరీ ఆదివారం వెలుగు చూసింది. జన సంచారం అధికంగా ఉండే ఈ ప్రాంతంలో చోరీ జరగడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

టమోటా కిలో రూ.18

అనంతపురంరూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో ఆదివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.18తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.11, సరాసరి ధర రూ.15తో విక్రయాలు జరిగాయన్నారు.

అందరికీ యూరియా అందిస్తాం

కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అవసరమైన వారందరికీ యూరియా అందించేందుకు చర్యలు చేపడుతున్నామనీ, రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా జిల్లాలో తగినంతగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. 2,478 మెట్రిక్ టన్నుల యూరియా రైతు సేవాకేంద్రాల్లో, ప్రైవేటు వ్యాపారుల వద్ద సిద్ధంగా ఉందన్నారు. సోమవారం జిల్లాకు 871 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో యూరియా పంపిణీని పర్యవేక్షించాలని తహసీల్దార్లు, ఆర్డీఓలు, జిల్లాస్థాయి వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించామన్నారు. రైతుల అవసరం మేరకు యూరియా తీసుకోవాలన్నారు. యూరియా కొనుగోలులో సమస్యలున్నా, అధిక ధరలకు విక్రయిస్తున్నా.. కమాండ్ కంట్రోల్ రూమ్ 8500292992 నంబర్‌కు ఫోన్ చేసి, సమస్య తెలియజేయవచ్చన్నారు.

తాడిపత్రి విడిచిన పెద్దారెడ్డి

భద్రతా ఇబ్బందులతో పంపించిన పోలీసులు



పెద్దారెడ్డిని పంపిస్తున్న పోలీసు అధికారులు

తాడిపత్రి, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాలతో రెండు రోజుల కిందట తాడిపత్రికి చేరిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి పోలీసులు షాక్ ఇచ్చారు. జిల్లా కేంద్రంలో ఈనెల 10న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్- సూపర్‌హిట్ ప్రోగ్రాం జరుగుతుందని, బలగాలు అక్కడికి వెళ్లాల్సి ఉందని, మీకు రక్షణ కల్పించడం సాధ్యం కాదని పోలీసు వర్గాలు తేల్చి చెప్పాయి. తాడిపత్రి విడిచి వెళ్లాలని కోరాయి. దీంతో తాను సొంత సెక్యూరిటీతో తాడిపత్రిలోనే ఉంటానని పెద్దారెడ్డి చెప్పినా పోలీసు వర్గాలు వినలేదు. ఏదైనా ఉంటే జిల్లా అధికారులతో మాట్లాడాలని స్థానిక పోలీసులు ఆయనకు సూచించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పెద్దారెడ్డి ఆదివారం తన స్వగ్రామమైన యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామానికి బయలుదేరారు. సీఎం ప్రోగ్రాం అనంతరం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తాడిపత్రికి వస్తాడని పలువురు నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తన బంధువు మరణించారని రెండురోజుల కిందట హైదరాబాద్‌కు వెళ్లడంతో తాడిపత్రికి పెద్దారెడ్డి ప్రశాంతంగా వచ్చాడని పలువురు చర్చించుకుంటున్నారు. చైర్మన్ తాడిపత్రిలో ఉంటే మళ్లీ రానిస్తాడా అనే చర్చ కూడా కొనసాగుతోంది.

పట్టుకుంటే పదివేలు !



ఏఎంసీలోని నీటి సరఫరా విభాగం

కార్పొరేషన్‌లో పదివేల కొళాయి అక్రమ కనెక్షన్లు

ఆఫ్‌లైన్ అనుమతులతో విచ్చలవిడిగా వసూళ్లు

పట్టించుకోని ఉన్నతాధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలో అనధికారికంగా 10వేలకు పైగా నీటి కొళాయి కనెక్షన్లు ఉన్నట్లు సమాచారం. పురపాలికలు, నగరపాలికల్లో నీటి కొళాయిలకు అనుమతి ఇవ్వడం, పన్ను వసూళ్లకు సంబంధించి అన్నీ ఆఫ్‌లైన్‌లో ఉండటం అక్రమార్కులకు కలిసి వస్తోంది. ఈక్రమంలోనే ఏఎంసీలోని ఇంజనీరింగ్ విభాగం తాగునీటి సరఫరా ఇంజనీర్లు, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇటీవల ఏఎంసీలో గుత్తిరోడ్డులోని ఓ హోటల్‌కు తాగునీటి కొళాయి కనెక్షన్ కోసం భారీగా ముడుపులు అందుకున్న తాగునీటి సరఫరా విభాగం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఇంజనీర్లకు కూడా వాటా ఇచ్చినట్లు సమాచారం. అయితే వాటాల్లో తేడా రావడంతో విషయం బయటకు పొక్కింది. నగరంలో 81,369 ఇళ్లు ఉండగా, 40వేలు మాత్రమే నీటి కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. ఇక కమర్షియల్‌కు సంబంధించి 10,251 వ్యాపార దుకాణాలు, హోటళ్లు, కళ్యాణమండపా లు, అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. కమర్షియల్ నీటి కనెక్షన్లు నగరంలో వెయ్యి మాత్రమే ఉన్నాయి.

పట్టించుకోని ఇంజనీర్లు, సిబ్బంది

నగరంలోని మూడు, నాలుగో రోడ్డుకు సమీపంలో ఓ అపార్ట్‌మెంట్ నిర్మాణంలో 20ప్లాట్లు ఉంటే, రెండు మూడు ప్లాట్లకే నీటి కొళాయిలకు అనుమతిచ్చారు. ఇందుకు సంబంధించి రూ.8.5లక్షలు వసూలు చేసుకున్నట్లు సమాచారం. నగరంలోని హౌసింగ్ బోర్డు, శాంతినగర్, శ్రీనగర్ కాలనీల్లో నిర్మిస్తున్న భవనాలలో కూడా ఇదే తరహాలో ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది, ఇంజనీర్లు చేతివాటం ప్రదర్శిస్తూ ఇష్టానుసారంగా ఇళ్లకు నీటి కొళాయి కనెక్షన్లకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. తాజాగా గుత్తిరోడ్డులో ఓ లాడ్జికి సంబంధించి నీటి కొళాయి కనెక్షన్‌కు ఇంజనీరింగ్ విభాగంలోని ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వసూల్ చేసినట్లు సమాచారం. తాను వసూలు చేసిన మొత్తంలో ఇంజనీర్లకు అందజేసినట్లు సమాచారం. తనపై వచ్చిన ఫిర్యాదుతో చర్యలు తీసుకుంటే వాటాలో భాగస్వాములైన ఇంజనీర్లపై కూడా చర్యలు తీసుకోవాల్సిందేనంటూ ఆ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి బహిరంగంగా చెప్పడం గమనార్హం. ఏఎంసీలోని తాగునీటి సరఫరా విభాగంలో ఇలా బహిరంగంగానే వసూళ్ల దందా నడుస్తున్నా అధికారులు, ఉన్నత ఇంజనీర్లు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

క్రమబద్ధీకరించుకోవాల్సిందే



నగరంలో కొత్త భవన నిర్మాణాలు చేపట్టడానికి ముందు, నీటి కొళాయికి తగిన రుసుం చెల్లించి కనెక్షన్ పొందాలి. అలా కాకుండా అనధికారికంగా నీటి కొళాయి తీసుకుంటే పట్టుబడిన సమయంలో భారీగా జరిమానా, పన్ను కట్టాల్సి ఉంటుంది. అనుమతి లేకుండా తీసుకున్న నీటి కొళాయి కనెక్షన్‌ను వెంటనే నగరపాలక సంస్థలో తగిన పన్ను చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలి. దీనిపై ఫిర్యాదు వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. మా ఇంజనీర్లు, సిబ్బందిపై ఫిర్యాదు చేసినా అదే తరహాలోనే చర్యలు ఉంటాయి.

- రాజశేఖర్, అనంత నగరపాలక సంస్థ ఎస్ఈ

అనధికార నీటి కొళాయిలు

నగరంలో 81,369 ఇళ్లు ఉన్నాయి. ఇందులో కమర్షియల్ దుకాణాలు, వ్యాపార సముదాయాలు, కళ్యాణమండపాలు, హోటళ్లు కలిపి మొత్తం 10,251 ఉన్నాయి. అయితే ఇళ్లకు సంబంధించి 40వేలు, కమర్షియల్ వెయ్యి మాత్రమే నీటి కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో మొత్తంగా నగరంలో 10వేలకు పైగా అనధికారికంగా నీటి కొళాయి కనెక్షన్లు తీసుకున్నట్లు సమాచారం. సాధారణ ఇంటి కొళాయి కనెక్షన్‌కు రూ.8125 చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో రెండు మూడు ప్లాట్లు ఉంటే అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇక కమర్షియల్ వ్యాపార దుకాణా సముదాయాలకు సంబంధించి రూ.35వేలకు పైగా నీటి కొళాయి కోసం రుసుం కట్టాల్సిన పరిస్థితి. అపార్ట్‌మెంట్‌కు ఒక్కో ప్లాట్‌కు రూ.50వేల వరకు చెల్లించాలి. నగరంలో నూతనంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లకు 20 ప్లాట్లు ఉంటే 10 ప్లాట్లకు మాత్రమే పన్ను కట్టించుకుని మిగతాది ఏఎంసీలోని ఇంజనీరింగ్ తాగునీటి సరఫరా ఇంజనీర్లు, సిబ్బంది జేబులోకి వేసుకుంటున్నట్లు సమాచారం.

ఆలయాల మూసివేత

గుంతకల్లు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లాలోని అన్ని ఆలయాలను మూసివేశారు. కసాపురంలోని నెట్టికంటి, మురడి, నేమకల్లు, పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి తదితర ప్రముఖ ఆలయాల తలుపులను మూసేశారు. ఆలయాల్లో మహా మంగళహారతి, సాయంకాల అర్చనలను ముందుగానే పూర్తి చేశారు. చంద్రగ్రహణం అనంతరం సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు ఆలయాల అధికారులు, అర్చకులు తెలిపారు.



కసాపురం ఆలయ తలుపులను మూసిన అధికారులు, అర్చకులు

గ్రహణ చంద్రుడు



రాత్రి 10.33 గంటలకు..



11.23 గంటలకు..



11.30 గంటలకు..

ఖగోళ అద్భుతమైన సంపూర్ణ చంద్రగ్రహణాన్ని వీక్షించేందుకు జిల్లా ప్రజలు ఆదివారం ఎంతో ఉత్సాహం చూపారు. రాత్రి దాదాపు పది గంటల సమయంలో గ్రహణం ప్రారంభం కావడంతో కొందరు బైనాక్యులర్‌లో ఆదృశ్యాన్ని వీక్షించగా చాలా మంది నేరుగా చూశారు. ఈ సందర్భంగా కొందరు తమ సెల్‌ఫోన్ ద్వారా చంద్రగ్రహణాన్ని చిత్రీకరించారు. గ్రహణాలపై ప్రజలకు ఉన్న మూఢ నమ్మకాలను తొలగించేందుకు జేవీవీ సభ్యులు గ్రహణ సమయంలో భోజనాలు చేశారు. కాగా చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవాలయాలను మధ్యాహ్నం నుంచే మూసివేశారు.

చురుగ్గా ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

అనంతపురం చేరనున్నారు. దీంతో సూపర్‌సిక్స్- సూపర్‌హిట్ సభ నిర్వహించే నగరంలోని జీఎంఆర్ గ్రౌండ్స్‌లో భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. బహిరంగ సభా వేదికతోపాటు, గ్యాలరీలు, హెలీప్యాడ్స్, పార్కింగ్ ప్రాంతాల్లో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి.

భారీ బహిరంగ సభావేదిక

శ్రీనగర్ కాలనీలోని జీఎంఆర్ ఇంద్రప్రస్థ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభా వేదికను సిద్ధం చేస్తున్నారు. సుమారు ఏడు అడుగుల ఎత్తులో సభావేదికను సిద్ధం చేస్తున్నారు. వంద మందికి పైగా పట్టే స్థాయిలో సభావేదికను రూపొందిస్తున్నారు. బహిరంగ సభా వేదిక అవసరాల కోసం విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు సైతం తరలిస్తున్నారు. ఈ పనులన్నీ దాదాపుగా కొలిక్కివచ్చాయి. వేదికకు ముందుభాగంగా 3.5లక్షల మంది ఆశీనులు కావడానికి అరకిలోమీరుకు పైగా భారీగా గ్యాలరీలు ఏర్పాటుచేశారు. వేదికకు ఇరువైపులా వీవీఐపీలు, వీఐపీలు, మీడియా గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు. వేదిక వెనుక వైపు సైతం పెద్ద పెద్ద స్థాయిలో టెంట్లు ఏర్పాటుచేస్తున్నారు. జాతీయ రహదారిలో చైతన్య స్కూల్ సమీపంలో రెండు హెలీప్యాడ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. చాపర్లు దిగేందుకు వీలుగా కాంక్రీట్ బేస్‌మెంట్‌తో స్ట్రాంగ్‌గా హెలీప్యాడ్స్ సిద్ధం చేస్తున్నారు.

వాహనాల కోసం పార్కింగ్ ఏరియాలు

బహిరంగ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు భారీగా హాజరుకానున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల పెద్దలతోపాటు, ఇతర నాయకులు కూడా హాజరుకానున్నారు. ప్రజలు 3.5 లక్షల మంది వచ్చే అవకాశం ఉందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. దీంతో వీరందరి సౌకర్యార్థం భారీగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నారు. నీరు- ప్రగతి పార్కు ఎదురుగా, చుట్టు పక్కల ఉన్న స్థలాన్ని శుభ్రం చేశారు. శ్రీనగర్ కాలనీలోని 80 నుంచి 95 శాతం ఓపెన్ స్థలాలన్నీ శుభ్రం చేస్తున్నారు. ఎక్స్‌కవేటర్లు పెట్టి ముళ్ల పొదలు, మట్టిదిబ్బలు శుభ్రం చేయించారు. మారుతీనగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియా, ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ అనుకుని ఉన్న ప్రాంతం, ఆ రైల్వే గేట్‌కు ఆనుకుని ఉన్న రోడ్డు వెంబడి ఉన్న ఓపెన్ స్థలాలను ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేయిస్తున్నారు. వేలాది వాహనాలు పార్కింగ్‌కు అనువుగా ఎక్కడ ఏ చిన్న ఖాళీ స్థలం కనిపించినా శుభ్రం చేయిస్తున్నారు. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఓపెన్ స్థలాలను శుభ్రం చేయిస్తున్నారు.

మహానాడుకు మించి సక్సెస్ చేస్తాం

14 నెలల్లోనే కీలక హామీల అమలు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

సభాస్థలి, ఏర్పాట్ల పరిశీలన



హెలీప్యాడ్ వద్ద బందోబస్తు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్-సూపర్‌హిట్ సభను కడపలో జరిగిన మహానాడుకు మించి విజయవంతం చేస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకు వచ్చిన ఆయన సీఎం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి సభాప్రాంగణాన్ని, సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించారు. తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే కీలకమైన హామీలు నెరవేర్చామన్నారు. తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక కార్యక్రమాలతో రాష్ట్రంలో మహిళలు చాలా ఆనందంగా ఉన్నారని తెలిపారు. సూపర్‌సిక్స్ హామీల అమలు గురించి చెప్పడానికే బహిరంగ సభ అని ఆయన పేర్కొన్నారు. సభకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఇతర ప్రముఖులు వస్తారని తెలిపారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర్ రావు మాట్లాడుతూ 11 సీట్లు ఇచ్చినా ప్రజల పక్షాన మాట్లాడలేని అసమర్థ నాయకుడు జగన్ అంటూ మండిపడ్డారు. లిక్కర్ స్కాంలో వైసీపీ నేతలంతా జైలు బాటలో ఉన్నారన్నారు. జగన్‌కు దమ్ము, ధైర్యం ఉంటే..అసెంబ్లీకి వెళ్లి మాట్లాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అంజన్న, ఏపీఐఐసీ చైర్మన్ రాజు, ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, దేవానంద, టీడీపీ ఇతర నాయకులు ఆలం నరసానాయుడు, రామలింగారెడ్డి, దేవళ్ల మురళి, బుగ్గయ్య చౌదరి, తలారి ఆదినారాయణ, జేఎల్ మురళి, రాయల్‌మురళి, మదమంచి స్వరూప, సింగవరం రవి, తేజశ్విని, హరి, నెట్టం బాలకృష్ణ రాజారావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సీఎం టూర్‌పై సమీక్ష

- మ్యాపుల ఆధారంగా పరిశీలించిన నాయకులు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, రాంప్రసాద్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్ సమీక్షించారు. ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో 10న జరిగే సీఎం బహిరంగ సభపై ఆదివారం చర్చించారు. మ్యాప్‌ల ఆధారంగా బహిరంగసభ, పార్కింగ్ ఏరియాలు, హెలీప్యాడ్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు,ఎంఎస్‌రాజు, బండారు శ్రావణిశ్రీ , ఏపీఐఐసీ చైర్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ ఏర్పాట్లు పూర్తి చేయండి : కలెక్టర్

సీఎం పర్యటన నేపథ్యంలో 15 చోట్ల పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. శ్రీనగర్ కాలనీ పక్కన విజేత సూపర్ మార్ట్ పక్కన, కేశవరెడ్డి స్కూల్ సమీపంలో, సంఘమిత్ర నగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియా, వీవీఐపీ, వీఐపీ పార్కింగ్ తదితర 15 ప్రాంతాల్లో చేస్తున్న పార్కింగ్ ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్థలాలు శుభ్రం చేయడం, రోలింగ్ చేయడం, పోల్స్ తొలగించడం, లెవలింగ్, ఎంట్రీ, ఎగ్జిట్స్ పనులు, మార్కింగ్ చేయడం వంటి పనులు వేగంగా పూర్తి కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, కమిషనర్ బాలస్వామి, ఈఈ షాకీర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

వదలని జ్వరం

(5వ పేజీ తరువాయి)



జర్వంతో బాధపడుతున్న వెంకటలక్ష్మమ్మ

నాలుగురోజులుగా జ్వరంతో బాధపడుతూ ఇంటి వద్దే ఉంటోంది. ఇదే గ్రామంలో బి. మున్నా, బి. ప్రసన్న, పునిత్, లక్ష్మీపతినాయుడు, గంగులప్ప కుమారైలు మలేశ్వరీ, శ్రీదేవి, రామిరెడ్డిపల్లిలో వైభవి, వైదీష్, మహమ్మదాబాద్ క్రాస్‌లో ప్రణీత్యా, ఆమె తల్లి శైలజ, తిప్పేపల్లిలో స్నేహ, నాగేంద్ర, ఓడీసీ బీసీ కాలనీలో హర్షియా, మినహా, ముంతాజ్, శివారెడ్డి, ఇలా చాలమంది జ్వరాల బారిన పడ్డారు.

లోపించిన పరిశుభ్రత

మండలకేంద్రంలోని బీసీ కాలనీలో పరిశుభ్రత లోపించింది. కాలనీలో మురుగునీటి కాలువలు లేకపోవడంతో వీధుల్లోనే మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెంది, పగలు రాత్రి తేడా లేకుండా కడుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. మురుగునీటి కాలువ లు ఏర్పాటుచేయాలని గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితంలేదన్నారు. పాలకులు మారుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పంచాయతీ అధికారులు కూడా ఫాగింగ్ చేయడం లేదని వారు పేర్కొన్నారు.

వైద్యసేవలు అంతంతే..



గత కొన్నిరోజులుగా నేను, నా కుమారై జ్వరంతో బాధపడుతున్నాం. స్థానికంగా ప్రభుత్వ వైద్యం అందకపోవడంతో ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రారంభంలో గొంతు, వొళ్లు నొప్పులతోమొదలై జ్వరం వస్తోంది. అధికారులు స్పందించి మెరుగైన వైద్యసేవలందించాలి.

- ఎన్‌శైలజ, మహమ్మదాబాద్ క్రాస్

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి



జ్వరాలు తగ్గేవరకు గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి. ప్రధానంగా నొప్పులు, జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత కొన్నిరోజులుగా నాకు మారైలు జ్వరంతో బాధపడుతున్నారు. ప్రభుత్వ వైద్యం అందకపోవడంతో ఓడీసీకి వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది.

-వల్లపు గంగులప్ప, బొండెద్దులవారిపల్లి

శిబిరాలు ఏర్పాటుచేస్తాం

జ్వరపీడిత గ్రామాలను గుర్తించి ఆప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తాం. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. సిబ్బందికి సూచనలిచ్చి, సకాలంలో వైద్యం అందేలా చర్యలు చేపడతాం.

-డాక్టర్ భానుప్రకాష్‌నాయక్, వైద్యాధికారి

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

ధర్మవరంరూరల్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారంపల్లి క్రాస్ 44వ జాతీయరహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు చెన్నేకొత్తపల్లి మండలం కోటంపల్లి గ్రామానికి చెందిన కోలు వంశీ (22) అనంతపురంలో ప్లంబర్ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. ఉదయం మాలపౌర్ణమి పండగకు సొంతూరికి తన స్కూటీపై బయల్దేరాడు. మార్గమధ్యంలో సీతారంపల్లి క్రాస్ సమీపంలో స్కూటీ అదుపుతప్పి పక్కనున్న డివైడర్లను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన వంశీని స్థానికులు 108 ద్వారా అనంతపురం తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య నందిని ఉన్నారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బ్లాక్‌మెయిల్ చేసిన వ్యక్తిపై కేసు

యాడికి, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): డబ్బులు బాకీ ఉన్నారని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న సయ్యద్ గౌస్‌బాషాపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు కడపజిల్లా రాయచోటికి చెందిన సయ్యద్ గౌస్‌బాషా రాయలచెరువుకు చెందిన పెయింట్‌షాపులో తనకు డబ్బులు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు తెలిపారు. డబ్బులు ఇవ్వని యజమాని రాజేష్‌ను చంపుతానని బెదిరించినట్లు సయ్యద్ గౌస్ బాషాపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సయ్యద్ గౌస్‌బాషా పలు దుకాణాల్లో ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. గుత్తిలోని ఒక ఎరువుల అంగడిలో, రాయలచెరువులోని ఒక గుజిరీ దుకాణంలో డబ్బులు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

ఒక్కొక్కటిగా వెలుగులోకి ..

కళ్యాణదుర్గంలోని ఒక ఫర్టిలైజర్ దుకాణంలో సయ్యద్‌గౌస్‌బాషా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి డబ్బులు వసూలుచేసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. గుత్తిలోని ఒక ఎరువుల అంగడిలో ఇదేవిధమైన బెదిరింపులకు పాల్పడినట్లు, వారు కూడా పోలీసులకు ఫిర్యాదుచేయడానికి యాడికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చినట్లు తెలుస్తోంది. రాయలచెరువులోని గుజిరి దుకాణంలో మహిళను డబ్బులు ఇవ్వాలని సయ్యద్ గౌస్‌బాషా బెదిరించినట్లు తెలిసింది. కడప జిల్లా సింహాద్రిపురంలో ఒక పెయింట్‌షాపు యజమానిని బెదిరించిన సీసీ పుటేజీ వీడియోలు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

యువకుడి ఆత్మహత్య

ధర్మవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన గోసుల భార్గవ (25) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు రాజేంద్రనగర్‌కు చెందిన లేట్ సాంబశివుడు కుమారుడు గోసుల భార్గవ మొబైల్ షాపులో పనిచేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేవాడు. ఐదేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో శస్త్రచికిత్సలు చేయించుకున్నాడు. కాలికి రాడ్లు వేయడం వల్ల దివ్యాంగుడిగా తాను ఏ పనిచేయలేకపోతున్నానని తరచూ మనోవేదన చెందేవాడు. ఈ క్రమంలో శనివారం ఇంటిపై మేడలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం ఎంత సేపటికి లేవకపోవడంతో కుటుంబసభ్యులు మేడపైకి వెళ్లారు. ఉరికి వేలాడుతున్న భార్గవను చూసి బోరున విలపించారు. టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడు అవివాహితుడు కాగా, తల్లితోపాటు ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు.

వినాయక విగ్రహం తగులుకుని

వంకలో మునిగిన యువకుడు



గిరీష్ (ఫైల్)

రాప్తాడు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): వంకలో ఈత కొడుతున్న యువకుడి ప్యాంటుకు ఇటీవల నిమజ్జనం చేసిన వినాయక విగ్రహం తగులుకుని, నీట మునిగి మరణించాడు. మండల కేంద్రానికి చెందిన తలారి నరసింహులు మూడో కుమారుడు తలారి గిరీష్ (23) ఇంటర్ పూర్తి చేశాడు. అయ్యవారిపల్లి రోడ్డులోని పండమేరు వంక వద్దకు స్నేహితులతో కలిసి వెళ్లాడు. మిత్రులు ఇళ్లకు వెళ్లిపోయారు. గిరీష్ వంకలో ఈత కొట్టేందుకు దిగాడు. ఇటీవల నిమజ్జనం చేసిన వినాయకుడి విగ్రహం ప్యాంటుకు తగులుకోవడంతో నీట మునిగి మృతిచెందాడు. గిరీష్ ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. వంక వద్ద గిరీష్ టీషర్ట్ కనిపించడంతో నీటిలో వెతకగా మృతదేహం లభించింది. గిరీష్‌కు వివాహం కాలేదు. అతడి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఫసల్ బీమాయ

(5వ పేజీ తరువాయి)

నరేంద్రనాయక్‌కు 8.25 ఎకరాల కందికి రూ.25వేలు ఫసల్ బీమా మంజూరైనట్లు మెసేజ్ వచ్చింది. ఆ రైతు ఖాతాకు రూ.800 మాత్రమే జమైంది. అదే గ్రామానికి చెందిన మహిళా రైతు నిర్మలాబాయికి 5 ఎకరాల కంది పంటకు రూ.15 వేలు మంజూరైనట్లు మెసేజ్ వచ్చింది. అయితే కేవలం రూ.400 జమైంది. ఈ రకంగా జిల్లాలోని పలువురు రైతులకు అతి తక్కువగా బీమా డబ్బులు జమ చేశారు. దీంతో మిగిలిన డబ్బులు ఎప్పుడు జమ చేస్తారో చెప్పేవారు లేక ఆ రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికీ ఖాతాలకు జమ కాని సొమ్ము..

ఈ ఏడాది ఆగస్టు 11న కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాజస్థాన్‌లోని జుంజును నుంచి దేశవ్యాప్తంగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా సొమ్మును విడుదల చేశారు. 2023 ఖరీఫ్, రబీ, 2024 ఖరీఫ్ సీజన్లకు సంబంధించి ఫసల్ బీమా ద్వారా జిల్లాకు రూ.77.49 కోట్లను విడుదల చేశారు. ఇందులో భాగంగా... 2023 ఖరీఫ్‌లో కంది రైతులకు రూ.1,59,73,932లు, 2023 ఖరీఫ్‌లో ఎండు మిరప రైతుకు రూ.1,33,72,251, 2023 ఖరీఫ్‌లో జొన్న రైతులకు రూ.45,70,041లు విడుదలైంది. 2023 ఖరీఫ్‌లో మూడు పంటలకు మొత్తం రూ.3,39,16,224లు విడుదలైంది. 2023 రబీ సీజన్‌లో పప్పుశనగ రైతులకు రూ.14,97,59,866, వేరుశనగ రైతులకు రూ.29,19,301లు విడుదలైంది. 2023 రబీలో రెండు పంటలకు మొత్తం రూ.15,26,79,168లు విడుదల చేశారు. 2024 ఖరీఫ్‌లో కంది రైతులకు రూ.56,55,43,578, 2024 ఖరీఫ్‌లో జొన్న రైతులకు రూ.2,28,41,233లు విడుదలైంది. 2024 ఖరీఫ్‌లో రెండు పంటలకు మొత్తం రూ.58,83,84,811లు విడుదల చేశారు. దీంతో తమకు ఫసల్ బీమా సొమ్ము జమఅవుతుందని రైతులు ఆశపడ్డారు. అయితే ఇప్పటి దాకా రైతులకు జమ కాలేదు. జిల్లాలోని అనేక మంది రైతుల ఫోన్లకు 2024 ఫసల్ బీమా కింద జమ అయ్యే డబ్బుల వివరాలతో సంక్షిప్త సమాచారం మాత్రమే పంపారు. అందులో మీ ఆధార్ బ్యాంక్ ఖాతా నెంబర్‌తో లింక్ కాకపోవడంతో ఫసల్ బీమా సొమ్ముజమ కాలేదంటూ సమాచారం వచ్చింది. మరికొందరికి ఫసల్ బీమా సొమ్ము మంజూరైనట్లు సమాచారం పంపారు. అయితే ఇప్పటి దాకా ఖాతాలకు బీమా డబ్బులు జమ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రూ.20,300 మంజూరైనా.. రూ.287 జమైంది..



ఫసల్ బీమా కింద 2.75 ఎకరాల కంది పంటకు రూ.20300లు మంజూరైనట్లు సెల్ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అయితే రూ.287లు మాత్రమే బ్యాంక్ ఖాతాకు జమైంది. ఫసల్ బీమా హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 14447కు ఒక సారి ఫోన్ చేసి, తక్కువ డబ్బులు జమైన విషయం చెప్పాగా.. పది రోజుల తర్వాత మళ్లీ ఫోన్ చేయాలని చెప్పారు. రెండో సారి ఫోన్ చేయగా.. ఎప్పటిలోగా మిగతా డబ్బులు పడతాయో సరైన సమాధానం చెప్పలేదు. సెల్ ఫోన్‌కు వచ్చిన మెసేజ్ ఆధారంగా డబ్బులు జమ చేయలేదు. మిగిలిన డబ్బులు జమ చేస్తారో..? లేదో అర్థం కావడం లేదు.

- రైతు తిప్పారెడ్డి, అయ్యవారిపల్లి, గుంతకల్లు మండలం

డబ్బులు జమ కాలేదు



గత ఏడాది మూడు ఎకరాల్లో కంది పంట సాగు చేసి నష్టపోయా. ఫసల్ బీమా కింద రూ.32వేలు మంజూరైనట్లు 20 రోజుల కిందటే సెల్ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. ఇప్పటి దాకా బ్యాంక్ ఖాతాలో ఒక్క పైసా జమ కాలేదు. ఇప్పటికే పలు సార్లు బ్యాంక్‌కు వెళ్లి అడిగినా ఇంకా డబ్బులు జమ కాలేదని చెబుతున్నారు. బీమా డబ్బులు ఎప్పుడు జమ అవుతాయో ఎవరూ సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి బీమా డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలి.

-రైతు హనుమంతునాయుడు, యాడికి

మధ్యప్రదేశ్ హ్యాట్రిక్ విజయం



వీరారెడ్డి



యశ్‌వర్ధన్ సింగ్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ జట్టు హ్యాట్రిక్ విజయాలను నమోదు చేసింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నేషనల్ ఇన్విటేషనల్ అండర్-19 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో మధ్యప్రదేశ్, బరోడా జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన మధ్యప్రదేశ్ జట్టు 48.1ఓవర్లలో 218పరుగులకు ఆలౌట్ అయ్యింది. యశ్‌వర్ధన్‌సింగ్ 106, శౌర్య 58 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన బరోడా జట్టు 38.1ఓవర్ల లో 130పరుగులకు ఆలౌట్ అయ్యింది. సమిత్‌రత్వ 58పరుగులు, ప్రియాన్ష్ జాదవ్ 47 చేశాడు. మధ్యప్రదేశ్ బౌలర్లు యువరాజ్ 4, గిరిరాజు శర్మ 2వికెట్లు పడగొట్టారు. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో ప్రెసిడెంట్ లెవెన్, సెక్రెటరీ లెవన్ జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన ఏసీఏ సెక్రెటరీ జట్టు 48.5ఓవర్లలో 167పరుగులకు ఆలౌట్ అయ్యింది. ప్రెసిడెంట్ బౌలర్ శాహల్ హమీద్ 5వికెట్లు పడగొట్టాడు. అనంతరం బరిలోకి దిగిన ప్రెసిడెంట్ జట్టు 27.1ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. బ్యాటర్ కేహెచ్ వీరారెడ్డి 40బంతుల్లోనే 13బౌండరీలు, 8సిక్సర్లతో (107) శతకాన్ని బాది జట్టుకు 7వికెట్ల విజయాన్ని అందించాడు. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

మౌనగిరి క్షేత్రాన్ని సందర్శించిన

కర్ణాటక హైకోర్టు జడ్జి



దక్షిణామూర్తి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జస్టిస్ దేవదాస్

రాప్తాడు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపాపురం గ్రామ సమీపానగల మౌనగిరి హనుమాన్ క్షేత్రాన్ని కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ దేవదాస్ ఆదివారం సందర్శించారు. మౌనగిరి క్షేత్రంలో దక్షిణామూర్తి దేవాలయ భూమిపూజ కార్యక్రమంలో న్యాయమూర్తి పాల్గొన్నారు. 39 అడుగుల ఏక శిలా హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. మౌనగిరి వ్యవస్థాపకుడు ఈశ్వరయ్య.. కర్ణాటక హైకోర్టు జడ్జిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా అదనపు జడ్జి సత్యవాణి పాల్గొన్నారు.

ఉత్తమంగా బోధించండి

- సినీ నటుడు నాగినీడు



మాట్లాడుతున్న సినీనటుడు నాగినీడు

ధర్మవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఉత్తమ బోధనతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలుగు సినిమా నటుడు నాగినీడు అన్నారు. స్థానిక ఎన్జీఓహోంలో ఆదివారం ఆత్మీయట్రస్టు, యూటీఎఫ్ ధర్మవరంశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మీయ ట్రస్టు చైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి అధ్యక్షతన ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగినీడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో కనెక్ట్ కాకపోతే మీరు చెప్పే పాఠాలు వారికి అర్థం కావన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే ఉపాధ్యాయుడి దగ్గరకు వచ్చేలా విద్యార్థులను మలుచుకోవాల్సిన బాధ్యత మీదేనన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో 68మందిని ఎంపిక చేసి వారికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు నాగినీడు చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ డీవైఈఓ జాన్‌రెడ్డప్ప, ధర్మవరం ఎంఈఓలు రాజేశ్వరదేవి, గోపాల్‌నాయక్, చిలమత్తూరు ఎంఈఓ హనుమంతురెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్, జిల్లాకార్యదర్శి రామకృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థల వివాదంతో ఆగిన అంత్యక్రియలు



శవపేటిక వద్ద బైఠాయించిన ఎస్సీలు

.చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లిలో శ్మశాన స్థల వివాదంతో వ్యక్తి అంత్యక్రియలు నిలిచిపోయాయి. గ్రామంలో దళితులు మృతిచెందిన ప్రతిసారీ అంతక్రియలకు అడ్డంకులు ఎదురవుతూనే ఉన్నాయి. తాజాగా దళితుడు నారాయణప్ప(77) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. అంతక్రియల ఏర్పాట్ల కోసం కుటుంబ సభ్యులు వెళ్లగా అదే గ్రామానికి చెందిన శంకరనారాయణ వర్గీయులు అడ్డు చెప్పారు. ప్రస్తుతం ఈ స్థల వివాదం కోర్టులో ఉందనీ, ఇక్కడ ఖననం చేయడానికి వీలులేదన్నారు. దీంతో దళితులు.. సమస్యను రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో గ్రామానికి చేరుకుని, చర్చించారు. శ్మశాన స్థలం సమస్య కోర్టులో నడుస్తున్నందున ప్రత్యామ్నాయ స్థలంలో అంతక్రియలు నిర్వహించుకోవాలని అధికారులు సూచించగా.. దళితులు ససేమిరా అన్నారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కాదని మరోచోట ఎలా అంతక్రియలు చేస్తామని ప్రశ్నించారు. దీంతో సమస్యను తహసీల్దార్, ఎస్ఐ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ధర్మవరం ఆర్డీఓ మహేశ్ రాత్రి బసంపల్లికి చేరుకుని, కుటుంబసభ్యులు, దళితులతో చర్చించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చివరికి సమస్య కొలిక్కి రాకపోవడంతో అంత్యక్రియలు నిలిచిపోయాయి. మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు, శవపేటిక వద్ద బైఠాయించి, నిరసన చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మాట్లాడుతూ.. దళితులు చనిపోయిన ప్రతిసారీ ఎక్కడ పూడ్చుకోవాలో తెలియక శవజాగరణ చేయాల్సిన పరిస్థితి రావడం దారుణమన్నారు. దళితుల శ్మశాన స్థలాన్ని కబ్జా చేసి, సమాధులను ధ్వంసం చేసి పంటను సాగు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇక్కడ 8 ఏళ్లుగా సమస్య కొనసాగుతున్న అధికారులు పరిష్కారం చూపకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామన్నారు.

ఐక్యంగా ఉందాం

● ఆత్మీయ సన్మాన సభలో వక్తల పిలుపు



సభలో మాట్లాడుతున్న అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురంరూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అందరం ఐక్యంగా ఉందామని వక్తలు పిలుపునిచ్చారు. ఇటీవల నామినేటెడ్, ఇతర పదవులు పొందిన బలిజ కులస్థులకు స్థానిక ఆర్టీఓ కార్యాలయం సమీపంలో గల అనంత కన్వెన్షన్ హాల్లో ఆదివారం కొప్పల మీనాక్షమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ జరిగింది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవికాంత్ రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షుడు శంకర్, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, అనంతపురం టౌన్ బ్యాంకు అధ్యక్షుడు జేఎల్ మురళి, జనసేన నాయకులు కాయగూర్ల లక్ష్మీపతి, జంగటి రాజగోపాల్, పగడాల మల్లికార్జున తదితరులు హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటిసారి బలిజలకు నామినేటెడ్ ఇతరత్రా పదవులు దక్కాయన్నారు. రానున్న రోజుల్లో బలిజలు రాజకీయ ఎదుగుదలకు ఐక్యత చాటాలన్నారు. ఎవరికి పదవులు దక్కే అవకాశం ఉన్నా తమ వంతు ప్రోత్సాహం అందించాలన్నారు. అనంతరం ఇటీవల పదవులు పొందిన టీసీ వరుణ్‌తో పాటు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ భవానీ రవికుమార్, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, శింగనమల, కదిరి మార్కెట్ యార్డు చైర్మన్లు దండు శ్రీనివాసులు, అనసూయమ్మ, శివప్రసాద్, రాచానపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు పాముదాయి రఘు, సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు వన్నప్ప, రాయల్ మహేష్, టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ అడిషనల్ సెక్రటరీ లక్ష్మన్న, కాపునాడు 5వ జోన్ జనరల్ సెక్రటరీ పాండురంగయ్యను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు వేణుగోపాల్, కాపునాడు జిల్లా అధ్యక్షుడు తాడాల నాగభూషణం, రాయలసీమ బలిజసంఘంయువజన విభాగం అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జాతర



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ అమ్మవారు

రామగిరి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో పెద్దమ్మ, కొల్లాపురమ్మ అమ్మవార్ల జాతర ఆదివారం వైభవంగా జరిగింది. స్థానిక అమ్మవారి ఆలయాల్లో గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి, జ్యోతులు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తర్వాత జంతుబలులు ఇచ్చారు. కొన్ని సంవత్సరాల అనంతరం జాతరను గ్రామంలో నిర్వహించడంతో భక్తులు విశేషంగా తరలివచ్చారు. దీంతో గ్రామం కిటకిటలాడింది.

సత్యసాయి చిత్రపటం ఊరేగింపు



సీకేపల్లిలో సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శతజయంతి వేడుకల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బాబా చిత్రపటాన్ని ఊరేగించారు. భజన బృందం సభ్యులు, భక్తులు చిత్రపటంతో పాటు పాదుకలను ఆయా గ్రామాలలో పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. పలువురు భక్తులు కలశాలను తలపై పెట్టుకుని ఊరేగించారు. మండలకేంద్రంలో శివాలయం నుంచి పెద్దఎత్తున ఊరేగింపు సాగింది. సత్యసాయి నామస్మరణతో భజన గీతాలు ఆలపించారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళిక ప్రకటించాలి



లేఖను విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వస్తున్న సీఎం చంద్రబాబు జిల్లా సమగ్ర అభివృద్ధికి నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన నాయకులతో కలిసి సీఎంకు బహిరంగ లేఖను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ... జిల్లా సమగ్రాభివృద్ధికి ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన అవసరముందన్నారు. హంద్రీనీవా కింద పంట కాలువలు తవ్వాలని, హెచ్చెల్సీ ఆధునుకీకరణ పనులను పూర్తి చేయాలని అన్నారు. గ్రామాల్లో దళితవాడలకు శ్మశానాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రైతులు, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తిదారులు, కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలని, ఖనిజ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు, విద్య, వైద్యం రంగాలకు నిధులు, సిబ్బంది నియామకం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాలరంగయ్య, రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగమణి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ కళాకారుడికి సన్మానం



నారాయణస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

నార్పల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.పప్పూరు గ్రామానికి చెందిన సీనియర్ కళాకారుడు, జ్యోతిష్య పండితుడు మాల్యవంతం నారాయణస్వామిని మండలకేంద్రంలో ఆదివారం తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు అంజనప్ప, గౌరవాధ్యక్షుడు డాక్టర్ సామవేదం బాలసుబ్రహ్మణ్యం, కళాభిషేకం డైరెక్టర్ పెద్దరికం సాయి, కార్యదర్శి బొగ్గు రవి ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు ఆయన సతీమణిని పూలమాలలు, శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీనియర్ కళాకారులను సన్మానించడం బాధ్యత అని అన్నారు.

శాస్త్రోక్తంగా సత్యదేవుడి వ్రతాలు



సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని పలు ఆలయాల్లో సత్యదేవుని వ్రతాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో మూడో రోడ్డులోని షిర్డీసాయి ఆలయంలో వేదపండితులు సత్యదేవుని వ్రతమండపం ఏర్పాటు చేసి, స్వామివారి చిత్రపటాన్ని విశేషంగా అలంకరించి వేద మంత్రోచ్చారణల నడుమ వ్రతాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.



పల్లె ఇంటిలో అల్పాహార విందులో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు



వెంకటాపురంలో పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద నివాళులు

పల్లె, పరిటాల ఇంట మంత్రులు, ఎమ్మెల్యేల సందడి

● సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ సభ విజయవంతంపై చర్చ

అనంతపురంరూరల్/ క్రైం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలో జరిగే సూపర్ సిక్స్-సూపర్‌హిట్ సభ కోసం వచ్చిన పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్ర ముఖులు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఇంట సందడి చేశారు. అనంతపురం రూరల్ ప్రాంతంలోని ఆలమూరు రోడ్డులో గల పల్లె నివాసానికి రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు ఎంఎస్‌రాజు, దగ్గుపాటి ప్రసా ద్, అమిలినేని సురేంద్రబాబు, ఏలూరి సాంబశివరావు, ఉగ్రనరసింహారెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, సూర్యప్రకాష్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర తదితరులు ఆదివారం ఉదయం వ చ్చారు. వారికి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం అందరూ ఈనెల 10వ తేదీన జరిగే సూపర్ సిక్స్- సూపర్ హిట్ మహాసభ.. విజయవంతంపై చర్చించారు. తర్వాత మంత్రులకు, ఎమ్మెల్యేలకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు రాయల్ మురళి, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

● రామగిరి: మండలంలోని వెంకటాపురంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ రాష్ట్ర నాయకుల రాకతో సందడి వాతావరణం నెలకొంది. మంత్రులు అనగానిసత్యప్రసాద్, గొట్టిపాటిరవికుమార్, రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఉగ్రనరసింహారెడ్డి, ఆనందరావు, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో పాటు పలువురు రాష్ట్ర నాయకులు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ ఆహ్వానం మేరకు వెంకటాపురం వెళ్లారు. తొలుత అక్కడి పరిటాలరవీంద్ర ఘాట్ వద్ద నివాళులర్పించారు. అనంతరం పరిటాల సునీత, శ్రీరామ్‌తో కలిసి విందులో పాల్గొన్నారు. తర్వాత ఈనెల 10న జరగనున్న సూపర్‌సిక్స్ - సూపర్‌హిట్ సభ విజయవంతం చేయడం గురించి , తమ తమ ప్రాంతాల్లో రాజకీయాల పట్ల కొద్దిసేపు చర్చించారు. పరిటాల రవీంద్రతో ఉన్న అనుబంధాన్ని గుర్తుకు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి మంత్రులను, ఎమ్మెల్యేలను కలిశారు.

సూపర్ సిక్స్ సభను విజయవంతం చేయండి

●మాజీ ఎమ్మెల్యే వైకుంఠం తరపున పలువురు టీడీపీ నాయకుల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న గంపన్న, దేవళ్ల మురళి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 10వ తేదీన నిర్వహించే సూపర్‌సిక్స్-సూపర్ హిట్ సభను విజయవంతం చేయాలని పలువురు టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి క్యాంపు కార్యాలయంలో ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవళ్లమురళి, డిప్యూటీ మాజీ మేయర్ గంపన్న, రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి నటేష్ చౌదరి, మీడియా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ చౌదరి, నాయకులు మారుతీకుమార్, విజయశ్రీ, ముర్తిజా తదితరులు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి గత కొన్ని రోజులుగా తీవ్ర దగ్గు, జ్వరంతో బాధపడుతున్నారన్నారు. ఈ క్రమంలో ఆయన బయట తిరిగే పరిస్థితిలో లేకపోవడంతో సూపర్‌సిక్స్-సూపర్ హిట్ సభకు జనసమీకరణ చేయాలని, విజయవంతం చేయాలని తమను ఆదేశించారన్నారు. నగరంలోని 50 డివిజన్లలో ఉన్న టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

నేడు సీపీఐ ఆందోళన

అనంతపురం విద్య, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు సకాలంలో ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లాలో ఆందోళనలు చేపట్టనున్నట్లు సీపీఐ నాయకుడు, ఏపీరైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రైతులకు సకాలంలో యూరియా కూడా అందించకపోవడం దారుణమన్నారు. చేసేదిలేక వారు అధిక ధరలతో బయటి మార్కెట్‌లలో కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా వారికి సకాలంలో ఎరువులు,విత్తనాలు అందించాలని డిమాండ్‌చేస్తూ జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడుతున్నామన్నారు. రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల వివక్ష తగదు

● ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి

అనంతపురం విద్య, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల వివక్ష చూపడం సరి కాదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి మండిపడ్డారు. నగరంలోని జిల్లా సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు యాజమాన్యం నిర్ణయించిన ప్రకారం కాంట్రాక్టర్లు వేతనాలు చెల్లించడం లేదన్నారు. వేతనాలలో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని అధికారులకు చెప్పినా.. ఏ మాత్రం పట్టించకపోవడం అన్యాయమన్నారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్ కూడా సరిగా జమచేయడం లేదన్నారు. అలాంటి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఏఐటీయూసీ జిల్లా నాయకులు రాజేష్‌గౌడ్, కృష్ణుడు, ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ కార్మికనాయకులు ఓబుల్‌రత్నం, ఎస్ఆర్ ఖాన్, గంగాంజనేయులు,ఎరుకుల ఈరన్న, ధర్మానాయక్, రామక్రిష్ణ, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువలో యువకుడి గల్లంతు

వజ్రకరూరు(ఉరవకొండ), సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి సమీపంలోని హంద్రీనీవా కాలువలో గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన నాగిరెడ్డి గల్లంతయ్యాడు. నాగిరెడ్డి, బెంగళూరుకు చెందిన సుదీప్, రంగనాథ్, హరీష్‌కుమార్ బెంగళూరులోని సాయి యాడ్ ఏజెన్సీలో పనిచేస్తున్నారు. వీరి మిత్రుడైన రాజశేఖర్ స్వగ్రామం పీసీ ప్యాపిలి. మాలపున్నమి పండుగకు బెంగళూరు నుంచి ఆదివారం వీరంతా వచ్చారు. గ్రామసమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద నాగిరెడ్డి స్నానం చేసేందుకు వెళ్లి.. ప్రమాదవశాత్తు కాలువలో జారిపడ్డాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న అగ్నిమాపకసిబ్బంది అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి దాకా గాలించినా ఆ యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి



పాదయాత్రలో మాట్లాడుతున్న బండారు కుళ్లాయప్ప

గార్లదిన్నె, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో పేదలకు అనేక సేవలందించిన ఆర్డీటీకి వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండారు కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. ఆర్డీటీ ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో ప్రజా ఉద్యమనేత సాకే గోవిందు చేపట్టిన సేవ్ ఆర్డీటీ- సేవ్ అనంతపురం మహా పాదయాత్ర మూడో రోజైన ఆదివారం గార్లదిన్నెకు చేరింది. ఈ పాదయాత్రకు బండారు కుళ్లాయప్పతో పాటు ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరప్ప, వీహెచ్‌పీఎస్ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పు ల్లన్న మద్దతునిచ్చారు. ఈ సందర్భంగా వారు తొలుత అక్కడి బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బండారు కుళ్లాయప్ప మాట్లాడుతూ... ఎంతోమంది పేదలకు ఆర్డీటీ అండగా ఉందన్నారు. అలాంటి సంస్థపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్రం మేల్కొని ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా నిరసన లు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సునీత, నరసింహులు, ఆదిలక్ష్మి, అంజినమ్మ, పెద్ద నరసింహులు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.15లక్షలు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశులసంతతో రూ. 3.15 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి రాఘవేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2.04 లక్షలు, ఆదివారం ఎనుములు, ఎద్దులు, ఆవుల సంత ద్వారా రూ.1.10 లక్షల ఆదాయం మార్కెట్‌కు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యేల రాక

చెన్నేకొత్తపల్లి/రామగిరి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలకేంద్రాలకు స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు పరచూరి ఎమ్మెల్యే సాంబశివరావు సోమవారం వస్తున్నట్లు టీడీపీ వర్గాలు ఆదివారం ప్రకటనలో తెలిపాయి. చెన్నేకొత్తపల్లిలో ఉదయం 10గంటలకు, రామగిరిలో 11గంటలకు స్థానిక టీడీపీ కార్యాలయాల్లో పార్టీ శ్రేణులతో జరిగే ప్రత్యేక సమావేశాల్లో పాల్గొననున్నట్లు చెప్పాయి. మండలాల్లోని టీడీపీ బూత్‌కన్వీనర్‌లు, గ్రామకమిటీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరాయి.

రాయితీపై జిప్సమ్ పంపిణీ: ఏఓ

శింగనమల,సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు రాయితీపై జిప్సంను పంపిణీ చేయనున్నట్లు ఏఓ అన్వేష్ కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మండలానికి రాయితీపై 30 మె ట్రిక్ టన్నులు జిప్సం వచ్చిందన్నారు. 50 కేజీల బస్తా పూర్తి ధర రూ.262 అని, అ యితే రాయితీ పోను రైతులు రూ.187 చెల్లించాలని అన్నారు. ఒక్కో రైతుకు 4 బ స్తాలు ఇస్తామన్నారు. కావాల్సిన వారు రైతు సేవా కేంద్రంలో పట్టాదారుపుస్తకం,ఆధార్,మొబైల్ నంబర్‌తో రావాలని సూచించారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

గార్లదిన్నె, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరుకు చెందిన నాగన్న కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి ఆదివారం అతడికి రూ. 10వేల ఆర్థిక సాయం అందచేశారు. అదేవిధంగా అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామదాసుపేట ఖాసీంను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్‌కుమార్ రెడ్డి కోరారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో ఆదివారం ఆయన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యావ్యవస్థలో గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకంతో పేద విద్యార్థుల కష్టాలను తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని, యూనివర్శిటీల్లో ఖాళీలను భర్తీ చేసి, నిధులు కేటాయించి ఉన్నత విద్యను పటిష్టం చేయాలని కోరారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగర సమీపంలోని నేషనల్ పార్క్‌లో గల శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శిల్పారామం ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఓంసంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ, వాణి డ్యాన్స్ అకాడమీ కళాకారులు చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు చూపరులను అలరించాయి. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా అముదాలవలస మండలం కొల్లవలస గ్రామంలో రెండు కుటుంబాల రజకులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని రజక సంఘాల పోరాట సమితి కో-కన్వీనర్ హ నుమన్న డిమాండ్ చేశారు. నగరంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రజకులపై ఓ సా మాజికవర్గానికి చెందిన కొందరు దాడి చేయడంతో ఆరుగురు గాయపడి ఆస్పత్రిపాలయ్యారన్నారు. బీసీలలో అత్యంత వెనుకబాటుకు గురైన రజకులపై దాడులు చేయడం సరి కాదన్నారు. అదే దాడిలో అరశివాలి హరమ్మ అనే రజక వృద్ధురాలు మృతి చెందిందన్నారు. ఈ విషయంలో పోలీసులను ఆశ్రయిస్తే.. బాధితులపైనే కేసు పెట్టడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రైతు పోరును విజయవంతం చేయండి

శింగనమల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలపై ఈనెల 9వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించే రైతుపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. అందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను మండలకేంద్రంలోని ఆత్మారామస్వామి ఆలయంలో ఆదివారం వారు విడుదల చేశారు. అనంతరం మండల కన్వీనర్ పూలప్రసాద్ మాట్లాడుతూ.. ఈ నెల 9వ తేదీ మంగళవారం జరిగే కార్యాక్రమానికి మండలం నుంచి పెద్ద ఎత్తున రైతులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు నార్పల సత్యనారాయణ, బొమ్మన శ్రీరామిరెడ్డి, అలీ బాషా, దాసరి వెంకటరమణ, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా వాడకంపై అవగాహన

రాప్తాడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయితీ కార్యాలయంలో ఆదివారం ఏఓ కృష్ణ చైతన్య యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యూరియా, ఇతర ఎరువులు పొలంలో కలుపు తీసిన తరువాత వేయాలన్నారు. యూరియాను తక్కువ మోతాదులో ఎక్కువ దఫాలుగా వాడాలన్నారు. భూసార పరీక్షలకు అనుగుణంగా అవసరం మేరకు ఎరువులు వాడటం మంచిదని పేర్కొన్నారు. ఏఈఓ సుజిత, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జి సోనియా, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మాలపున్నమి





వెంకటాపురంలో గోపూజ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, కనగానపల్లి మండలం ముక్తాపురంలో గంగమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

రామగిరి,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఆదివారం మాలపున్నమి (మహాలయ పౌర్ణమి) వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా వెంకటాపురం గ్రామంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ఉదయమే గోవులకు పూజలు చేశారు. తరువాత పొలం వద్దకు వెళ్లి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ పండుగను రాయలసీమ జిల్లాల్లో ఎక్కువగా జరుపుకుంటారని, దసరాకు ముందు వచ్చే పౌర్ణమి రోజున ఈ పండగను ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. మరీ ముఖ్యంగా గ్రామాల్లో పెద్దఎత్తున జరుపుకుంటారని చెప్పారు.

● కనగానపల్లి: మండలవ్యాప్తంగా గ్రామాల్లో మాలపున్నమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో గ్రామ దేవతలకు మహిళలు బోనాలు సమర్పించి పూజలు చేశారు. రైతులు తమ పంట పొలాల్లో పూజలు చేశారు. అనంతరం జంతుబలులు ఇచ్చారు. మాలపున్నమి నాడు ఇలా చేస్తే పంటలు బాగా పండుతాయని పలువురు రైతులు తెలిపారు.

పేట్రేగుతున్న పోకిరీలు

- మహిళలపై నిత్యం వేధింపులు
- బడి, గుడి తేడా లేకుండా వికృత చేష్టలు
- వణుకుతున్న యువతులు, విద్యార్థినులు



యాడికి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో మహిళలపై వేధింపులు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. బడికి వెళ్లాలన్నా, పొలం పనులకు వెళ్లాలన్నా, బస్టాపుల్లో వేచి ఉండాలన్నా పోకిరీల వేధింపులు భరించాల్సిందే అన్నట్లుగా పరిస్థితి తయారైంది. వేధింపులు భరించలేక, బయటకు చెప్పుకోలేక ఎక్కువ మంది మహిళలు, యువతులు లోలోన కుమిలిపోతున్నారు. మరికొందరు ధైర్యం చేసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తున్నారు. అయితే ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళుతున్న మహిళలతో రాజీ ప్రయత్నాలు చేస్తుండటంతో తమకు భద్రత ఎక్కడుంది అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు

- తిప్పారెడ్డిపల్లిలో ఒక మహిళను వేధించిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
- లక్షుంపల్లి గ్రామంలో పొలం పనులకు వెళ్లిన మహిళపై అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన కోరిక తీర్చకపోతే చంపుతానని బెదిరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- యాడికిలో ఓ బాలికపై 55ఏళ్ల వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదుచేశారు.
- మండలంలో ఒక యువతిని వివాహం చేసుకోవాలని కిడ్నాప్ చేశారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.
- మండలంలోని ఒక పాఠశాలలో చదివే బాలికపై సమీప బంధువు లైంగిక వేధింపులకు పాల్పడి గర్భవతిని చేసిన సంఘటన ఉంది. దీనిపైనా కేసు నమోదైంది.
- పాఠశాలకు వెళుతున్న ఒక విద్యార్థినిపై ఒక పోకిరి దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు.
- కళాశాలకు వెళ్లే సమయంలో దారిలో పోకిరీల వేధింపులు భరించలేక ఒక బాలిక కళాశాల మానుకుంది. దీనిపై అప్పట్లో అధికారులు విచారణ చేపట్టారు.

కాఫీ, టీ హోటళ్ల వద్ద పోకిరీలు

కళాశాలలు, పాఠశాలలు వదిలే సమయంలో కొందరు పోకిరీలు కాఫీ, టీ హోటళ్ల వద్ద మకాం వేసి అమ్మాయిల వెంటపడి వేధిస్తున్నారు. బైక్‌లపై చిత్ర, విచిత్ర విన్యాసాలు చేస్తూ దారివెంట నడుచుకుంటూ వెళ్లే వారిని ఇబ్బంది పెడుతున్నారు. ఎవరైనా మందలిస్తే పోకిరీల బ్యాచ్ అంతా గుంపుగా తయారై దాడికి దిగుతున్నారు. పాఠశాలకు వెళ్లే బస్సులను ద్విచక్రవాహనాల్లో వెంబడిస్తూ బస్సుల్లోని అమ్మాయిలను వెకిలిచేష్టలతో వేధిస్తున్నారు. యాడికిలోని కోనరోడ్డు సర్కిల్, గుత్తిరోడ్డు, ఆదర్శ పాఠశాలకు వెళ్లే క్రాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పోకిరీలు తిష్టవేసి వేధింపులకు పాల్పడుతున్నారు.

వేధింపుల నివారణ చర్యలు ఏవీ?

మహిళలపై వేధింపుల నివారణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చినపుడు మాత్రం నామమాత్రంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండటం విమర్శలకు దారి తీస్తోంది. ఏదైనా సంఘటన జరిగినప్పుడు లేదా వార్తాపత్రికల్లో వచ్చినపుడు మాత్రం వేధింపుల నివారణపై హంగామా చేయడం, తర్వాత వదిలేయడం సర్వసాధారణమైనదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వెంటపడి వేధిస్తున్నారు

కళాశాలకు వెళ్లే సమయంలో కొందరు యువకులు బైక్‌లలో వెంటపడుతూ వేధిస్తున్నారు. నడుచుకుంటూ వెళుతున్న వారివద్దకు బైక్‌లో వేగంగా వచ్చి కామెంట్ చేసి వెళుతున్నారు. ఇంటిలో వారికి చెబుదామంటే చదువు మాన్పిస్తారేమోనని భయంగా ఉంది. కళాశాలకు వెళ్లే సమయంలో పోలీసులు నిఘా పెట్టాలి. పోకిరీల ఆగడాలను అరికట్టాలి.

\- కళాశాల విద్యార్థిని, యాడికి

పోకిరీల ఆగడాలను అరికట్టాలి



ఇటీవల కాలంలో మహిళలపై వేధింపులు ఎక్కువయ్యాయి. మరీ ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు పోకిరీల ఆగడాలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మందుబాబుల దుశ్చర్యలకు అడ్డుఅదుపు లేకుండా పోతోంది. సాయంత్రం వేళల్లో బడి, గుడి అని తేడా లేకుండా తిష్ట వేస్తున్నారు. దారిలో వెళ్లే మహిళలపై అసభ్యకర కామెంట్లు చేస్తున్నారు. వీటిపైన పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలి.

\- మహాలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్, యాడికి

న్యూస్ బాక్స్

ఉద్యాన పంటలతో అధిక లాభాలు



భైరవాన్‌తిప్ప ప్రాజెక్టును పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

గుమ్మఘట్ట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ మాజీ మంత్రి దేవినేని ఉమ, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. వారు మండలంలోని భైరవాన్ తిప్ప ప్రాజెక్టు (బీటీపీ)ని ఆదివారం పరిశీలించారు. అనంతరం రైతులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు హార్టికల్చర్ పంటలను సాగుచేసి దేశ, విదేశాలకు ఎగుమతి చేసి అధిక లాభాలు సాధించేదానిపై దృష్టి పెట్టాలన్నారు. ఇందుకు తగిన సలహాలు, సూచనలు పొందేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. మూడేళ్లలలో హంద్రీనీవా జలాలతో బీటీపీని నింపి ఇక్కడి రైతులకు శాశ్వతంగా నీటి సమస్య తొలగిస్తామన్నారు. అనంతపురంలో బుధవారం నిర్వహించే సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ దానవేంద్ర, బీటీపీ ప్రాజెక్టు చైర్మెన్ కాలవ రాజు, టీడీపీ యువనాయకులు రమేష్, సంజీవ, నీరగంటి తిమ్మప్ప, ఉస్మాన్ పాల్గొన్నారు.

చీరలతో పంటలకు రక్ష



తొండపాడు వద్ద పొలం చుట్టూ కట్టిన చీరలు

గుత్తిరూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అడవి పందులు, జింకల బెడద నుంచి పంటలను కాపాడుకోవడానికి రైతులు నానా పాట్లు పడుతున్నారు. పలు గ్రామాల్లో సాగుచేసిన వేరుశనగ పంటకు పిందలు కాయలు ఉన్నాయి. వాటిని రాత్రివేళల్లో పందులు, జింకలు వచ్చి తినేస్తూ.. పంటలను నాశనం చేస్తున్నాయి. వాటి బారి నుంచి పంటలను రక్షించుకోవడానికి కొంతమంది రైతులు పొలాల చుట్టూ కర్రలు ఏర్పాటు చేసి.. వాటికి చీరలు కడుతున్నారు. చీర రూ.20 ప్రకారం 200 నుంచి 300 కొనుగోలు చేసి.. వాటిని పొలాల చుట్టూ ఏర్పాటు చేసుకున్నారు. మరి కొందరు రైతులు మైకులు ఏర్పాటు చేసుకుంటున్నారు.

వాటర్ ప్లాంట్‌ను బాగుచేయరూ..



మూతపడిన వాటర్ ప్లాంటు

కుందుర్పి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పది సంవత్సరాల క్రితం ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ రూ. లక్షలు వెచ్చించి ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. కొన్ని సంవత్సరాల క్రితం దాన్ని పంచాయతీకి అప్పగించింది. ఐదు నెలల క్రితం వాటర్ ప్లాంట్‌లోని పనిముట్లు చెడిపోవడంతో.. దాన్ని బాగు చేయించకుండా అధికారులు మూసివేశారు. దీంతో ప్రజలు తాగడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిరుపయోగంగా ఉండటంతో రూ.లక్షల విలువైన యంత్రాలు సైతం దెబ్బతినే ప్రమాదముందని, దానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

విడపనకల్లు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక అమృత ఏజెన్సీ జువారి ఫార్మ హబ్ ఎరువుల షాపులను ఉరవకొండ ఏడీఏ సత్యనారాయణ ఆదివారం తనిఖీ చేశారు. ఎరువులు, మందులు ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే వారి లైసెన్స్ రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనవెంట ఏఓ పెన్నయ్య ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

గుత్తి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు డానియేల్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న విషయం తెల్సిందే. దీంతో ఆయన్ను స్థానిక మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇందులో మార్నింగ్ వాకర్స్ సభ్యులు రవికుమార్, ఓబులరాజు, హెచ్‌ఎం విజయ్‌భాస్కర్, ఏఎస్ఐ నాగేంద్ర ప్రసాద్, లైన్‌మెన్లు శ్రీనివాసులు, ఫక్రుద్దీన్, ప్రవీణ్‌కుమార్, శివశంకర్, చిదంబర్‌రెడ్డి, పోతులయ్య, శ్రీధర్‌గౌడ్, సలీం పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ సభను విజయవంతం చేద్దాం

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం నిర్వహించే సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభను విజయవంతం చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గం సమన్వయ కర్త వాసగిరి మణికంఠ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో జనసైనికులు, అభిమానులు, ప్రజలు తరలిరావాలన్నారు.

- పుట్లూరు : జిల్లాకేంద్రంలో బుధవారం నిర్వహించే సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలివచ్చి.. విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ బాలరంగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.
- శెట్టూరు : మండలంలోని టీడీపీ శ్రేణులు అధికంగా తరలివచ్చి.. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించే సూపర్ హిట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు మండల కన్వీనర్ తిప్పేస్వామి నాయకులు, ప్రభాకర్‌రెడ్డి, గురుప్రసాద్, మాజీ సర్పంచ్ ఆంజనేయులు ఆదివారం కోరారు.

కరపత్రాల ఆవిష్కరణ

పామిడి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో ఈనెల 15న రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు స్థానిక సీపీఎం నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద అందుకు సంబంధించిన కర పత్రాలను వారు ఆవిష్కరించారు. ఇందులో కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు మాబు, సీపీఎం నాయకుడు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేసు, ముత్యాలు, నల్లప్ప, సాయికుమార్, షాషు, లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఘన స్వాగతం



పల్లా శ్రీనివాస్‌తో ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో బుధవారం జరుగుతున్న సూపర్ సిక్స్-సూపర్ హిట్ కార్యక్రమానికి ఆదివారం విచ్చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఘన స్వాగతం పలికారు. అనంతరం సభావేదిక, ఏర్పాట్లపై చర్చించారు. ఏర్పాట్లు బాగున్నాయని హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర మంత్రులను కలిసిన నాయకులు



మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో జితేంద్రగౌడ్, యువనాయకులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు అనగాని వరప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాశ్రీనివాస్ యాదవ్ ఆదివారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ శాసనసభ్యుడు ఆర్ జితేంద్రగౌడ్‌తో కలిసి వారు సభ స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ పవన్‌కుమార్ గౌడ్, గుత్తి మాజీ ఎంపీపీ వీరభద్రయ్య, నాయకులు ఆర్ అనిల్ గౌడ్, టీ కేశప్ప, కురుబ చంద్రశేఖర్, ముక్కన్నగారి రామాంజినేయులు,శ్రీరాములు గౌడ్, మహమ్మద్ అలి, శివప్ప ఉన్నారు.

బీఎంఎస్ రాష్ట్ర కన్వీనర్‌గా నెట్టికంటి



నియమకపత్రం అందుకుంటున్న బీ నెట్టికంటి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): బీఎంఎస్ రాష్ట్ర కో-కన్వీనర్‌గా పట్టణానికి చెందిన బీ నెట్టికంటి నియమితులయ్యారు. విజయవాడలో శనివారం భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఇందులో బీఎంఎస్ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. బీఎంఎస్ రాష్ట్ర కో-కన్వీనర్‌గా పట్టణానికి చెందిన బీ నెట్టికల్లు నియమించారు.

మండలానికి చేరిన యూరియా

విడపనకల్లు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు 140 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినట్లు ఏఓ పెన్నయ్య తెలిపారు. వరి సాగు చేసిన రైతులకు మాత్రమే యూరియా ఒక బస్తా లేదా 2 బస్తాలు మాత్రమే ఇస్తామన్నారు. మిగిలిన రైతులకు వారి పంటను బట్టి ఎరువులు ఇస్తామన్నారు. త్వరలోనే అన్ని గ్రామాలకు ఎరువులు తెప్పించి రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు.

మాల పౌర్ణమికి గ్రహణం

బెళుగుప్ప, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈ యేడాది మాలపౌర్ణమి రోజే చంద్రగ్రహణం రావడంతో ఆదివారం సందడి లేకుండా పోయింది. ఈ పండుగ వచ్చిందంటే గ్రామాల్లో ఆ రోజంతంగా ఎక్కడ చూసినా మాంసాహార భోజనాలతో సంబరాలు చేసుకునేవారు. అయితే ఆ సారి గ్రహణం రావడంతో రాత్రి 9 గంటలు దాటితే ఏమీ తినరాదు. దీంతో ఈ సారి గ్రామాల్లో మాలపౌర్ణమి సందడి కనిపించలేదు. కాగా, మండలంలో కొన్ని గ్రామాల్లో మంగళవారం పండుగ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

టీడీపీతోనే శాలివాహనులకు గుర్తింపు



ఈశ్వర్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

తాడిపత్రి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొట్టమొదట తెలుగుదేశంపార్టీయే శాలివాహనులను గుర్తించిందని శాలివాహన కమ్యూనిటీ చైర్మన్ ఈశ్వర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శాలివాహనులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చంద్రబాబు అన్ని కులాలు, మతాలకు మంచి ప్రాధాన్యం ఇస్తున్నారని, అందులో భాగంగానే శాలివాహనులకూ ఉన్నతస్థానం కల్పించారని అన్నారు. కులవృత్తుల వారికి మంచి పదవులు ఇచ్చారన్నారు. శాలివాహనుల అభివృద్ధికి పాటుపడతామన్నారు. అనంతరం ఈశ్వర్, శాలివాహన సంఘం గౌరవ అధ్యక్షుడు రామకృష్ణ శాలివాహన కల్యాణ మండపాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో శివదుర్గ బాబు, శాలివాహన సంఘం డైరెక్టర్ సజ్జలదిన్నె సుబ్బయ్య, రామకృష్ణ, మునలయ్య, బాలసుబ్బయ్య, రామాంజనేయులు, నరసింహులు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నిత్యం వెలుగుతున్న వీధిదీపాలు



ఉంతకల్లులో పట్టపగలే వెలుగుతున్న వీధిదీపం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ, విద్యుత్ అధికారులు పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం వల్ల మండలంలో పలు గ్రామాల్లో వీధిదీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. దీంతో వందలాది యూనిట్లు విద్యుత్ వృథా అవుతుంది. ఫలితంగా విద్యుత్‌శాఖ, పంచాయతీలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ప్రత్యేక లైన్‌లు, ఆన్ ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. దీనిపై డిప్యూటీ ఎంపీడీఓ దాస్‌ను వివరణ కోరగా... మండలంలో అన్ని వీధిలైట్లకు ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో వీధిలైట్లకు ప్రత్యేక వైరును విద్యుత్ అధికారులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎం పర్యటనపై గ్రామాల్లో ప్రచారం

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు బుధవారం జిల్లా కేంద్రానికి వస్తున్న నేపథ్యంలో నిర్వహించే సభకు భారీగా అభిమానులు తరలిరావాలని టీడీపీ సీనియర్ నాయకులు ఆదివారం పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలోని కళ్యాణదుర్గం రూరల్, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కంబదూరు మండలాల పరిధిలోని టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామంలోను పర్యటించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో సభకు వెళ్లడానికి ఆర్టీసీ బస్సులు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

యూరియా కోసం పోరుబాట: వైసీపీ

గుంతకల్లు/టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వైసీపీ గుంతకల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, మాజీ చైర్మన్ జింకల రామాంజనేయులు, నాయకులు నూర్ నిజామి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు..!



ఉంతకల్లులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

బొమ్మనహాళ్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లు గ్రామంలో సచివాలయం వెళ్లే దారిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పిచ్చిమొక్కలు తీగలు అల్లుకొని ఉండటంతో ప్రమాదకరంగా మారింది. అక్కడక్కడ ముళ్లచెట్లు భారీగా పెరిగి విద్యుత్ తీగలకు అంతరాయం కలిగిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. వర్షం పడితే పెను ప్రమాదం జరిగే అవకాశముందని, అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

- దెబ్బతిన్న స్తంభం

కుందుర్పి : స్థానిక బోయవీధిలో విద్యుత్ స్తంభం కింది భాగం పూర్తిగా దెబ్బతిని ... ఓ వైపు ఒరిగింది. అది ఎప్పుడు కూలుతుందో ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోతున్నారు.



కుందుర్పిలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభం

క్రైం న్యూస్..

హంద్రీనీవా కాలువలో యువకుడి గల్లంతు



నాగిరెడ్డి

వజ్రకరూరు(ఉరవకొండ), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి సమీపంలోని హంద్రీనీవా కాలువలో గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన నాగిరెడ్డి గల్లంతయ్యాడు. నాగిరెడ్డి, బెంగళూరుకు చెందిన సుదీప్, రంగనాథ్, హరీష్‌కుమార్ బెంగళూరులోని సాయి యాడ్ ఏజెన్సీలో పని చేస్తున్నారు. వీరి మిత్రుడైన రాజశేఖర్ స్వగ్రామం పీసీ ప్యాపిలి. మాలపున్నమి పండుగకు బెంగళూరు నుంచి ఆదివారం వీరంతా వచ్చారు. గ్రామసమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద నాగిరెడ్డి స్నానం చేసేందుకు వెళ్లి.. ప్రమాదవశాత్తు కాలువలో జారిపడ్డాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న అగ్నిమాపకసిబ్బంది అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి దాకా గాలించినా ఆ యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

యాడికి, సెప్టెబరు 7(ఆంధ్రజ్యోతి): పుట్లూరు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సునీత శనివారం యాడికిలోని తన సమీప బంధువు లక్ష్మీకాంతమ్మ ఇంటికి వచ్చారు. ఆదివారం ఉదయం సునీత కుమారుడు ఆరు సంవత్సరాల కృష్ణకుమార్ ఆడుకుంటూ తప్పిపోయాడు. యాడికిలోని తిరుణాంపల్లిరోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా.. స్థానికులు ఆ బాలుడిని తీసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఆ బాలుడితో సమాచారాన్ని రాబట్టి సునీతకు అప్పగించారు.

పెరిగిపోతున్న చోరీలు

యల్లనూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో దొంగతనాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నా ఎటువంటి ప్రయోజనమూ లేదని బాధితులు వాపోతున్నారు. పదిరోజులక్రితం పెద్దమల్లేపల్లి పొలాల్లోకి దుండగులు ఏకంగా ట్రాక్టర్ తీసుకొని వచ్చి తోటలో ఉంచిన టిల్లర్‌ను తీసుకువెళ్లారు. వారం క్రితం గడ్డంవారిపల్లి సమీపంలో తోటలో ఉంచిన రోటవేటర్ పరికరాన్ని అపహరించారు. శనివారం రాత్రి మండలకేంద్రంలో వెనకయ్యకాలవరోడ్డు సమీపంలో గొర్రెల మంద నుంచి పొట్టేలను ఎత్తుకెళ్లారు. దొంగతనాలకు సంబంధించిన సమాచారం కిందిస్థాయి సిబ్బందికి తెలిసినా వాటిని అధికారుల దృష్టికి తీసుకుపోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. దొంగతనాలు అరికట్టేలా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆలయంలో చోరీ



శశుమాకుల ఆలయంలో అమ్మవారు

కుందుర్పి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిగానపల్లి సమీపాన శశుమాకుల ఆలయంలో శనివారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ అర్చకుడు శనివారం సాయంకాలం పూజలు చేసుకుని ఆలయానికి తాళాలు వేసుకుని వెళ్లారు. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చి చూసేసరికి తాళాలను పగులగొట్టి ఉండటాన్ని గమనించి.. లోనికి వెళ్లి చూశాడు. అమ్మవారి మంగళసూత్రం వెండి ఆభరణాలతో పాటు రూ. ఆరు వేల నగదు చోరీ అయినట్లు గుర్తించాడు. గతంలోనూ ఈ ఆలయంలో చోరీ జరిగినట్లు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

జూదరుల అరెస్టు

ఉరవకొండ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణుమాకులపల్లి పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు.. ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న రూ.4,390 నగదు, ఏడు బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని, కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వజ్రకరూరు మండలం రాగులపాడు వద్ద ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 13.7 క్వింటాళ్ల సబ్సిడీ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగస్వామి ఆదివారం తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులకు అప్పగించామని ఎస్ఐ పేర్కొన్నారు.



రోడ్డు మలుపు వద్ద పెరిగిన ముళ్లకంపలు

రోడ్డును కప్పేసిన కంపచెట్లు

కూడేరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలం కమ్మూరు గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు భారీగా పెరిగాయి. అనంతపురం- బళ్లారి ప్రధాన రహదారి నుంచి కమ్మూరు వరకు ఉన్న దాదాపు రెండు కిలోమీటర్ల రహదారి మొత్తం పరిస్థితి ఇలాగే ఉంది. ఈ గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్థులు ద్విచక్రవాహనాలు, ఆటోల్లో ప్రయాణం సాగిస్తున్నారు. మలుపులు ప్రాంతంలో ఎదురుగా వచ్చే వాహనం కనిపించకపోవడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రోడ్డుకు ఇరువైపులా భారీగా పెరిగిన కంపచెట్లు

రిజర్వాయర్‌కు 2,184 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,184 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,144 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం తెలిపారు. రిజర్వాయర్‌లో 1.691 టీఎంసీల నీటి నిల్వ ఉందని, ఫేజ్-2కు 2,004 క్యూసెక్కుల నీరు వెళ్తోందన్నారు.